# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 09-10-2024 సంపుటి : 06 సంచిక : 14 పేజీలు : 8 వెల : రూ 3-00







## అపమరణకు గురైన శిశువు కథ సుఖాంతం


### కిడ్నాపర్‌ను పట్టుకున్న పోలీసులు

గుంటూరు,అక్టోబర్ 8 : గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం అర్ధరాత్రి అపహరణకు గురైన నవజాత శిశువు కథ సుఖాంతం అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు రూరల్ మండలం గోరంట్లకు చెందిన షేక్ నసీమాకి అనే గర్భిణి జీజీహెచ్‌లో ప్రసవించింది. ఆమెకు పండంగి మగ బిడ్డ పుట్టాడు. అయితే అర్ధరాత్రి సమయంలో వారి వద్దకు వచ్చిన ఓ మహిళ మాటలు కలిపింది. తన భర్తకు ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రిలో చేరినట్లు చెప్పింది. తాము పక్క గదిలోనే ఉంటున్నామని నమ్మించింది.

# ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి వేడుకలు



### మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన అమ్మవారు
### నేడు సరస్వతీదేవిగా అమ్మవారి దర్శనం
### పట్టువస్త్రాలు సమర్పించనున్న సిఎం చంద్రబాబు దంపతులు



విజయవాడ,అక్టోబర్ 8(ఆర్ఎన్ఎ): ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనక దుర్గాదేవి మంగళవారం మహాలక్ష్మి దేవి అలంకారం లో భక్తులకు దర్శనం ఇచ్చింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జామునుంచే బారులు దీరారు. దసరా నవరాత్రి ఉత్సవాలు ఆరో రోజు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, పోలీసులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బందోబస్తును నిర్వహించారు. నవరాత్రులలో ఏడవ రోజు బుధవారం మూల నక్షత్రం కావడంతో అమ్మవారు సరస్వతి దేవి అలంకారం లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అమ్మవారికి బుధవారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్య ప్రభుత్వం తరపున ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. శరన్నవరాత్రుల్లో అమ్మవారు.. తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఆ క్రమంలో ఏడో రోజు అంటే ఆశ్వయుజ మాస శుక్ల పక్ష సప్తమి రోజు దుర్గమ్మవారు.. సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. చదువు, విజ్ఞానం, సంగీతం, కళలకు దేవతగా సరస్వతి దేవిని భక్తితో కొలుస్తారు. ఓం శ్రీసరస్వతీ దేవియే నమ: అనే మంత్రం ఈ రోజు చదువుకోవాలి. ఈ రోజు.. అమ్మవారికి అటుకులు, బెల్లం, శనగపప్పు, కోబ్బరి ప్రసాదంతోపాటు దద్యోజనాన్ని నైవేద్యంగా సమర్పించాలి. ఇక సరస్వతి దేవిని తెలుపు రంగు చీరతో అలంకరిస్తారు. అయితే అమ్మవారి జన్మ నక్షత్రం.. మూలా రోజున అమ్మవారిని దర్శించుకుంటే.. శుభ ఫలితాలు కలుగుతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. ఇక ఈ రోజు అమ్మవారిని పూజించడం వల్ల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారని విశ్వసిస్తారు. శరన్నవరాత్రుల్లో మూల నక్షత్రం రోజు సరస్వతి దేవిని ఆరాధిస్తారు. సప్తమి తిథి సరస్వతి అమ్మవారిది. ఇక అష్టమి దుర్గాదేవి. నవమి, మహార్నవమి మహిషాసుర మర్ధిని పూజిస్తారు. మూల నక్షత్రం ఉన్నప్పుడే సరస్వతి దేవిగా దుర్గమ్మను అలంకరించి.. పూజిస్తారు. మరోవైపు విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువు తీరిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో దుర్గమ్మ వారు.. బుధవారం సరస్వతి దేవిగా దర్శనమివ్వనున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారి జన్మ నక్షత్రం రోజు.. లక్షలాది మంది భక్తులు ఇంద్రకీలాద్రికి పోటెత్తనున్నారు. ఇప్పటికే గత ఆరు రోజులుగా వివిధ రూపాల్లో దర్శమిస్తున్న అమ్మవారిని దర్శించుకునేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విజయవాడకు తరలి వస్తున్నారు.

# లోక్‌సభ ఎన్నికల పరాభవంతో అప్రమత్తం

### సోషల్ ఇంజనీరింగ్‌పై భారీగా దృష్టి
### ప్రభుత్వ వ్యతిరేకతపై సానుకూల చర్యలు
### హ్యాట్రిక్ విజయం సాధించడంలో బిజెపి సక్సెస్



న్యూఢిల్లీ,అక్టోబర్ 8 లోక్‌సభ ఎన్నికల్లో తగిలిన షాక్ నుంచి హరియాణాలో భాజపా వేగంగా పుంజుకొంది. సామాజిక ఇంజినీరింగ్ నుంచి ఎన్నికల వ్యూహాల వరకు అన్నింటికి పదును పెట్టింది. మోదీ-షా ద్వయం అన్నీ తామై రాష్ట్రంలో పార్టీని నడిపించారు. ఫలితంగా ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తల్లకిందులు చేస్తూ హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. పార్లమెంట్ ఎన్నికల్లో హరియాణాలో సీట్లు తగ్గడంతో భాజపా అప్రమత్తమైంది. దీనిని ఉపేక్షిస్తే.. రాష్ట్రం చేజారే ప్రమాదం ఉందని భావించింది. అభ్యర్థుల ఎంపిక నుంచి కుల సమీకరణల వరకు కసరత్తు చేసింది. ముఖ్యంగా జాతీయ స్థాయి నేతలతోకాకుండా.. రాష్ట్ర స్థాయిలోనే భాజపా ఈ పోరాటం చేయడం విశేషం. ప్రీపోల్స్, పోస్ట్ పోల్ సర్వేలు ప్రభుత్వ వ్యతిరేకత బలంగా ఉందని కోడై కూసినా.. ప్రజలు మాత్రం కమలదళానికే పట్టం కట్టారు. భాజపా సోషల్ ఇంజినీరింగ్ కూడా బలంగానే పనిచేసిందనే ప్రచారం జరిగింది. రాష్ట్రంలో జాట్ వర్గం కాంగ్రెస్ ఛత్రం కింద ఏకమవుతోందని భాజపా గ్రహించింది. దీనికి రెజ్లర్ల ఆందోళన కూడా తోడవడంతో బలమైన ఓబీసీ వర్గాన్ని తమ వైపునకు తిప్పుకొనేందుకు నాయబ్‌సింగ్ సైనీకి అధికార పగ్గాలు అందించింది. దీంతో ఆ రాష్ట్రంలో జాట్ వర్సెస్ ఇతరులు అన్న పోరాటంలో పైచేయి సాధించింది. దీనికి తోడు దళితుల్లో బలమైన జాటవ్‌లు కాంగ్రెస్ పక్షం వహించగా.. వారిలో మిగిలిన కులాలు భాజపా వైపు మళ్లాయి. అగ్రకులాలు, పంజాబీలపై భాజపా ఎక్కువగా ఆధారపడింది. ఈక్రమం లో లోక్‌సభ ఎన్నికల్లో నష్టంతో వెంటనే తేరుకొని.. పార్టీ రాష్ట్ర పగ్గాలను బ్రాహ్మణవర్గానికి చెందిన మోహన్‌లాల్ బదోలికి అప్పగించింది. రాష్ట్రంలో ఈ వర్గం ఓట్లు 7.5శాతం ఉంటాయి. 11 సీట్లను ఈ వర్గానికి కేటాయించింది. సాధారణంగా రాష్ట్రంలోని అగ్రకులాలు, పంజాబీల్లో ఎక్కువ కుటుంబాలు దేశ విభజన తర్వాత వలసవచ్చి స్థిరపడ్డవే. వీరు గ్రాండ్ ట్రంక్‌రోడ్ మార్గంలోని అర్బన్ నియోజకవర్గాల్లో అధికంగా ఉంటారు. 2014, 2019 ఎన్నికల్లో వీరే భాజపాకు మద్దతుగా నిలిచారు. మరోవైపు కాంగ్రెస్ జాట్-దళిత్ కూటమి ఏర్పాటుచేసింది. భాజపా యాంటీ జాట్ కూటమితో హస్తం పార్టీ దూకుడు తగ్గించాల్సి వచ్చింది. ముఖ్యంగా జాట్ వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా ప్రకటిస్తే.. అర్బన్ ఓట్లను కోల్పోవచ్చనే ఆందోళన చెందింది. దీంతో సీఎం అభ్యర్థి పేరు ప్రకటనను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఈ ఏడాది ప్రారంభంలో జేజేపీ హఠాత్తుగా మద్దతు ఉపసంహరించిన సమ యంలో పార్టీ అధికారం చేజార కుండా కాపాడుకోగలగడం ఎన్నికల్లో కలిసొచ్చింది. మహిళలు కేంద్రంగా భాజపా ఎన్నికల ప్రచారం సాగింది. ఫలితంగా అతి వల్లో ఆ పార్టీపై కొంత సానుకూలత ఉంది. రైతు ఆందోళన వల్ల వచ్చిన ప్రతికూల ఇమేజీ నుంచి బయటపడటానికిఈ ఏడాది ఆగస్టులో24పంటలకుకనీస మద్దతు ధర ఇవ్వాలని నిర్ణయిం చింది.

# అందరికీ సమాన హక్కులు పవన్ లక్ష్యం

## మీడియాతో మంత్రి నాదెండ్ల మనోహర్



గుంటూరు,అక్టోబర్ 8(ఆర్ఎన్ఎ): ప్రతి ఒక్కరికి సమాన హక్కులు కల్పించాలన్నదే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ధ్యేయమని, అందుకోసమే ఆయన పోరాడుతున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ప్రతి ఒక్క కులాన్ని, మతాన్ని గౌరవించుకోవాలని పవన్ కల్యాణ్ చెప్తారని పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి విషయాన్ని రాజకీయ కోణంలో చూడడం వైసీపీకి అలవాటేనని విమర్శించారు. ప్రజలు కష్టాల్లో ఉన్న ప్రతిసారి జనసేన వాళ్లకు అండగా నిలబడుతూ వస్తాదని వెల్లడించారు. తిరుపతి లడ్డూ వివాదం సృష్టించిందే వైసీపీ అని ఆరోపించారు. వైసీపీ పాలనలో మతం, భాష అంటూ ప్రజలను విడగొట్టారని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్న సమయాన్ని ప్రతిపక్షాలు వృథా చేసుకోవద్దని, గ్రామస్థాయిలో పర్యటించి ప్రజల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని రావాలన్నారు. గుంటూరు జిల్లాలో యువతకు ఉపాధి కల్పిస్తామని, వాణిజ్య పంటలు పండించే రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని వివరించారు.

# 14 నుండి పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణీయా




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 08-ఈనెల 14 నుండి 20 తేది వరకు వారం రోజులపాటు నిర్వహించే పల్లె పండుగ కార్యక్రమంలో నిర్దేశించిన అభివృద్ధి పనులను శ్రీకారం చుట్టేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పంచాయతీరాజ్, డ్వామా అధికారులను ఆదేశించారుమంగళవారం రాష్ట్ర సచివాలయం నుండి పల్లె పండుగ కార్యక్రమం నిర్వహణపై ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, గ్రామీణాభివృద్ధి, అడవులు, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ శాఖా మంత్రి పవన్ కళ్యాణ్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ జి రాజకుమారి, డ్వామా పీడీ జనార్ధన్ రావు, పంచాయతీరాజ్ ఎస్ఈ నాగరాజు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ నుండి 20 తేది వరకు నిర్వహించే పల్లె పండుగ కార్యక్రమంలో దాదాపు 90 కోట్ల రూపాయలతో మంజూరు చేసిన 1024 పనులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నామని డిప్యూటీ సీఎంకు వివరించారు. ఉపాధి హామీ పథక నిధుల అనుసంధానంతో చేపట్టనున్న సిసి రోడ్లు, డ్రైన్లు, బిటి రోడ్లు తదితర పనులకు ప్రారంభోత్సవాలకు స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించి పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరిపాలన ఉత్తర్వులు మంజూరు చేసిన 1026 పనులకు వారం రోజుల వ్యవధిలో శంకుస్థాపనలు చేసి పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని [redacted] కలెక్టర్ వివరించారు. అంతకుముందు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఈనెల 14 నుండి 20 వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో "పల్లెపండగ ? పంచాయతీ వారోత్సవాలు" కార్యక్రమంలో నిర్దేశించిన పనులకు పెద్దఎత్తున శంకుస్థాపనలు చేయాలన్నారు. శంకుస్థాపన కోసం గ్రామ పంచాయితీలు, ఎమ్మెల్యేలవారీగా రోజువారీ రూట్ మ్యాప్‌లను సిద్ధం చేసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయితీల్లో ఒకేరోజు గ్రామసభలు నిర్వహించి వరల్డ్ రికార్డ్ యూనియన్ అవార్డు అందుకున్నామన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ. 2081 కోట్ల వేతన బకాయిలు జమ చేశామని మంత్రి తెలిపారు. 2024-25 ఏడాదికిగాను రూ. 4,500 కోట్ల నిధులతో పనులకు గ్రామ సభల ఆమోదం పొందాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 వేల పనులకు పల్లె పండుగలో శ్రీకారం చుట్టామన్నారు పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు మంజురైన పనులకు పండుగ వాతావరణంలో భూమిపూజలు నిర్వహించాలన్నారు. ఉపాధి, ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన నిర్మాణాలు సంక్రాంతి పండుగలు పూర్తిచేసి ప్రారంభోత్సవాలు జరుపుకోవాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు.

# ఆర్టీసీ బస్టాండును రాష్ట్రంలోనే నంబర్ వన్ బస్టాండ్ గా తీర్చిదిద్దుతాం

## రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్





విభారే న్యూస్. కర్నూలు ప్రతినిధి అక్టోబర్ 08 :-కర్నూలు ఆర్టీసీ బస్టాండును రాష్ట్రంలోనే నంబర్ వన్ బస్టాండ్ గా తీర్చిదిద్దుతాం అని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక. కర్నూలు-1 డిపో గ్యారేజీలో 2 క్రొత్త సూపర్ లగ్జరీ బస్సులను మరియు 1 క్రొత్త అల్ట్రా డీలక్స్ బస్సులను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టి.జి.భరత్ జెండా ఊపి ప్రారంభించి అనంతరం బస్సు నడిపారు. మంత్రి మాట్లాడుతూ మన కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ కు గతంలో మంచి పేరు ఉండేదని, మరల గతంలో లాగానే రాష్ట్రములో నంబర్ వన్ ఆర్టిసి బస్టాండ్ గా తీర్చిదిద్దుతామన్నారు. ఈరోజు మూడు ఆర్టీసీ నూతన బస్సులను ప్రారంభించిన వాటి లో 2 సూపర్ లగ్జరీ బస్సులు కర్నూలు-బెంగళూరు రూటులో, ఒక అల్ట్రా డీలక్స్ బస్సు కర్నూలు-తిరుపతి రూట్ల నందు త్రిప్పడం కొరకు ఈ బస్సులను ప్రారంభించడం జరిగిందన్నారు. గతంలో 10 నూతన బస్సులను ప్రారంభించుకున్నామని, మొత్తం ఇప్పటివరకు 13 నూతన బస్సులు మన ఆర్టీసీ డిపోలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ కు ల్యాండ్ కూడా అందుబాటులో ఉంది కాబట్టి ఈ ప్రదేశంలో రాయలసీమలోనే మంచి కన్వెన్షన్ హాలు ఉండేలా కన్వెన్షన్ హాల్ నిర్మించడానికి ప్లాన్ తయారు చేయాలని ఆర్ ఎం ను కూడా ఆదేశించామన్నారు. మన కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించే ప్రభుత్వం, మన ముఖ్యమంత్రి ఆలోచన లకు అనుగుణంగానే మన ఆర్టీసీ బస్టాండ్ ను కూడా అంచలంచెలుగా అభివృద్ధి పథం లో ముందుకు తీసుకెళ్తామని మంత్రి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు , కర్నూలు-1 మేనేజరు శ్రీమతి సుధారాణి, కర్నూలు-2 డిపో మేనేజరు సర్దార్ హుస్సేన్ , కర్నూలు-1, కర్నూలు-2 డిపోల అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

బుధవారం 08-10-2024

## డ్రాగన్ ను అడగడుగునా అడ్డుకుంటూ....

భారత్‌కు దాయాది దేశం పాకిస్తాన్ తలనొప్పిగా మారింది. ఉగ్రవాదులను, చొరబాట్లను ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్ భారత్‌లో అలజడికి ప్రయత్నిస్తోంది. ఐదేళ్లుగా మరో పొరుగు దేశం చైనా కూడా తన చర్యలతో భారత్‌ను కవ్విస్తోంది. తరచూ సరిహద్దులు మారుస్తూ.. మ్యాప్‌లు విడుదల చేస్తోంది. గాల్వన్‌లో అయితే చొరబాటుకు ప్రయత్నించింది. భారత సైన్యం దానిని తిప్ప కొంట్టింది. అప్పటి నుంచి చైనా భారత్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. అప్పటి నుంచి భారత్‌ను కవ్విస్తోంది. దీంతో మోదీ కూడా చైనాకు చెక్ పెట్టే చర్యలు మొదలు పెట్టారు. పలు చైనా యాప్‌లను బ్యాన్ చేసి కోట్ల రూపాయల ఆదాయానికి గండి కొట్టాడు. చైనా తయారీ వస్తువుల దిగుమతిపై ట్యాక్స్‌లు పెంచారు. చాలా వరకు దిగుమతులు తగ్గించారు. ఈ నేపథ్యంలో చైనా దొడ్డిదారిన భారత్‌పై నిఘా పెడుతోంది. మనతో సన్నిహితంగా ఉండే, శ్రీలంక, మాల్దీవులను మచ్చిక చేసుకుని సరిహద్దుల్లో నిఘా పెంచుతోంది. ఇక భారత సరిహద్దుల్లో అనేక నిర్మాణాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో భారత్ కూడా చైనా ఎత్తుకు పైఎత్తులు వేస్తోంది.పొరుగు దేశాలపై నిఘా కోసం చైనా ప్రత్యేకంగా బెలూన్లు తయారు చేసి వినియోగిస్తోంది. తాజాగా ఈ బెలూన్లను కూల్చివేసే అంశంపై భారత వాయుసేన దృష్టిపెట్టింది. దాదాపు 15 కిలోమీటర్ల ఎత్తులో ప్రయాణిస్తున్న వస్తువులను కూల్చడంపై ఎయిర్‌ఫోర్స్ కమాండోలకు శిక్షణ ఇచ్చింది. అత్యంత ఎత్తులో ఉన్న బెలూన్లను కూల్చే ఆపరేషన్‌లో రఫేల్ యుద్ధ విమానాలు పాల్గొన్నాయి. దీనిలో ఉపయోగించిన బెలూన్లకు పేలోడ్‌ను కూడా అమర్చారు. దీనిని 55 వేల అడుగుల ఎత్తులో ఒక క్షిపిణిని ప్రయోగించి కూల్చేశారు. దీంతో గగనతలంల నిదానంగా కదిలే భారీ టార్గెట్లను కూడా కూల్చే సత్తాను భారత్ ఏర్పాటు చేసుకుంది.ఇక డ్రాగన్ కంట్రీ చైనా 2023 నుంచి నిఘా బెలూన్లను ప్రయోగిస్తోంది. అమెరికాలో దక్షిణ కరోలినా గగనతలంల ఓ నిఘా బెలూన్ ప్రత్యక్షమై సంచలనం సృష్టించింది. నాడు అమెరికా యుద్ధ విమానం ఎఫ్?22 సాయంతో దీనిని కూల్చారు. ఆ తర్వాత ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలపై చైనా నిఘా బెలూన్లు కనిపించాయి. భారత్‌లో కూడా త్రివిధ దళాల కమాండ్ ఉన్న అండమాన్ నికోబార్ దీవులపైనా కనిపించాయి. మరో వైపు క్వాడ్‌లో ఆతిథ్య అమెరికాతో పాటు భారత్, ఆస్ట్రేలియా, జపాన్‌లకు సభ్యత్వం ఉంది. జో బైడెన్, మోదీతో పాటు ఆస్ట్రేలియా, జపాన్ ప్రధానమంత్రులు ఆంథోని అల్బెనీస్, ఫ్యుమియో కిషిడ ఈ సమ్మిట్‌కు హాజరయ్యారు. సుమారు మూడు గంటల పాటు ఈ సమ్మిట్ కొనసాగింది. పలు అంశాలు ఇందులో చర్చకు వచ్చాయి.సభ్య దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించడం, ఫ్రీ అండ్ ఓపెన్ ఇండో–పసిఫిక్ రీజియన్ ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వడం, ఆరోగ్య భద్రత, విపత్తుల నిర్వహణ, సరిహద్దుల భద్రత, మౌలిక సదుపాయాల కల్పన, వాతావరణ మార్పులు, సైబర్ సెక్యూరిటీ అంశాలపై చర్చించారు.ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తత పరిస్థితులు, ఘర్షణలతో సతమతమౌతోన్న ప్రస్తుత పరిస్థితుల్లో క్వాడ్ సదస్సు ఏర్పాటు కావడం అత్యవసరమని ప్రధాని మోదీ అన్నారు. సభ్య దేశాల సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను పరస్పరం గౌరవించుకోవడం, వివాదాలను శాంతియుత వాతావరణంలో పరిష్కారించుకోవడానికి చర్చలే శరణ్యమని చెప్పారు. స్వేచ్ఛా వాణిజ్యం, సమ్మిళిత, సుసంపన్నమైన ఇండో–పసిఫిక్ రీజియన్‌ను నెలకొల్పుకోవాలనేదే క్వాడ్ భాగస్వామ్య దేశాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. మిగిలిన దేశాలకు క్వాడ్ ఓ దిక్సూచిగా మారుతుందని మోదీ వ్యాఖ్యానించారు. సమావేశం అనంతరం జో బైడెన్, మోదీ, ఆంటోనీ అల్బెనీస్, ఫ్యుమియో కిషిడ.. జాయింట్ స్టేట్‌మెంట్ విడుదల చేశారు.దక్షిణాసియా రీజియన్‌లో తరచూ సరిహద్దు జలాల్లోకి ప్రవేశిస్తూ ఉద్రిక్తతలకు కారణమౌతోన్న చైనాను అడ్డుకోవడానికి ప్రత్యేకంగా ఓ వ్యవస్థను తెర మీదికి తీసుకుని రావాలని నిర్ణయించారు. క్వాడ్ అట్ సీ షిప్ అబ్జర్వర్ మిషన్‌కు రూపకల్పన చేయాలని ప్రతిపాదించారు. యూఎస్ కోస్ట్ గార్డ్, భారత్ కోస్ట్ గార్డ్, జపాన్ కోస్ట్ గార్డ్, ఆస్ట్రేలియన్ బోర్డర్ ఫోర్స్‌కు ఇందులో భాగస్వామ్యాన్ని కల్పిస్తారు.తీర ప్రాంతాల సరిహద్దు జలాల భద్రత కోసం ఈ తరహా వ్యవస్థ ఏర్పాటు కావడం అనేది ఇదే తొలిసారి.ఇంటర్ ఆపరేబిలిటీని మెరుగుపరచడం, సముద్ర జలాల భద్రతను మరింత పటిష్ట పర్చడం, ఇండో–పసిఫిక్ రీజియన్ పరిధిలో మున్ముందు మరిన్ని జాయింట్ ఆపరేషన్/మిషన్‌లను చేపట్టాలని నిర్ణయించారు.క్వాడ్ భాగస్వామ్య దేశాల మధ్య ఎయిర్‌లిఫ్ట్ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి కొత్తగా క్వాడ్ ఇండో–పసిఫిక్ లాజిస్టిక్స్ నెట్‌వర్క్ పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాలని నిర్ణయించారు. సీ లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను ఈ రీజియన్ అంతటా మరింత వేగంగా విస్తరింపజేయడానికి క్వాడ్ పోర్ట్స్ ఆఫ్ ది ఫ్యూచర్ పార్ట్‌నర్‌షిప్‌కు నాంది పలికారు. భారత్ చైనాకు చెక్ పెట్టేలా గగణతలంలో పేల్చే పరిజ్ఞానం సొంతం చేసుకుంది.

# భువనేశ్వరి దేవిగా కాళికామాత ...





విభారె న్యూస్ అక్టోబర్ 08 ఆళ్లగడ్డ మా ప్రతినిధి :- ఆళ్లగడ్డ విశ్వరూప నగర్ కాళికామాత దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రముఖ శిల్పి దురగడ్డ రవీంద్ర చారి, మహిళా కమిటీ అధ్యక్షురాలు దురగడ్డ అనురాధ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆరవ రోజు శ్రీ భువనేశ్వరి దేవి అలంకారంలో కాళికామాత అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. మంగళవారం ఉదయం సుప్రభాతం అభిషేకము అనంతరం ప్రధాన అర్చకులు చంద్రశేఖర ఆచారి అమ్మవారి ని పట్టు వస్త్రాలు, ఆభరణాలు వివిధ రకాల పుష్పాల చేత భువనేశ్వరి దేవిగా అలంకరించారు ఈ సందర్భంగా దురగడ్డ రవీంద్ర చారి ధర్మపత్ని సావిత్రి, దురగడ్డ శేఖర్ ఆచారి ధర్మపత్ని పవిత్ర, నందికుంట సాయన్న ఆచారి ధర్మపత్ని సుబ్బమ్మ, నందికుంట శివ బ్రహ్మ ఆచారి ధర్మపత్ని హరిణి ఉభయ దారులుగా వ్యవహరించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. శ్రీ భువనేశ్వరి దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రతిరోజు నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు. మహిళా కమిటీ సభ్యులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# పట్టణ సుందరీకరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి :జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 08-జిల్లాలోని మున్సిపల్ ప్రాంతాలలో పట్టణ సుందరీకరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో అన్న క్యాంటీన్లు, 200 రోజుల ప్రణాళిక, ఎస్టిపి ల్యాండ్, పట్టణ సుందరీకరణ, శానిటేషన్, త్రాగునీటి సరఫరా తదితర అంశాలపై మునిసిపల్ కమిషనర్లతో సమీక్షించారు. నంద్యాల ఆర్డీవో మల్లికార్జున్ రెడ్డి, నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ బేబీ, డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ అన్ని మున్సిపల్ పట్టణ ప్రాంతాలలో ముమ్మర పారిశుద్ధ పనులు చేపట్టడంతో పాటు సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలన్నారు. పట్టణ సుందరీకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అందంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వంద రోజుల ప్రణాళికలో చేపట్టి పూర్తి చేసిన పనులన్నీటిని తాను స్వయంగా పరిశీలిస్తానన్నారు. అలాగే 200 రోజుల ప్రణాళిక లక్ష్యాల నివేదికలను తనకు సమర్పించాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి నూతనంగా ప్రారంభించిన అన్న క్యాంటీన్లను తరచూ పర్యవేక్షించాలన్నారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించడంతోపాటు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలన్నారు. అన్న క్యాంటీన్లకు నిర్వహణకు సంబంధించి వార్తాపత్రికలలో ప్రతికూల వార్తలు వస్తే సహించేది లేదని ఆమె స్పష్టం చేశారు. మురికి నీటి శుద్ధి ప్లాంట్ లకు అవసరమయ్యే స్థలాలకు నంద్యాలలో 3 ఎకరాలు, ఆళ్లగడ్డలో 2.8, ఆత్మకూరులో 3, నందికొట్కూరులో 3.4, డోన్ లో 7.5 ఎకరాల స్థల సేకరణ కొరకు సంబంధిత ఆర్డీవోలతో కోఆర్డినేట్ చేసుకొని వారం రోజుల్లో సంబంధిత ప్రతిపాదనలు కలెక్టరేట్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్లను ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల తో పాటు మున్సిపాలిటీలలో అందుబాటులో ఉన్న నిధులతో పట్టణ సుందరీకరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. డోన్ మున్సిపాలిటీలో అమృత్ సరోవర్ కింద ఈఎల్ఎస్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి అవసరమయ్యే 20 సెంట్లు స్థలాన్ని కూడా సంబంధిత ఆర్డీవోతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని డోన్ మున్సిపల్ కమిషనర్ ను కలెక్టర్ ఆదేశించారు. నంద్యాల పట్టణంలో బయోగ్యాస్ కు అవసరమైన 5 ఎకరాల స్థలాన్ని గుర్తించాలని నంద్యాల ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ఇప్పటినుండే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కమిషనర్లను సూచించారు. నంద్యాల పట్టణంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని కలెక్టర్ ప్రశ్నించారు. అన్ని మున్సిపాలిటీలలోని పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని తలపించేలా గ్రీనరీ ని పెంచడంతోపాటు ఆకర్షణీయమైన రీతిలో రోడ్డులకు ఇరువైపులా రంగులతో దిద్దిన చిత్రాలను వేయడంతోపాటు డివైడర్ల మధ్యలో గ్రీనరీని పెంచాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.

# బాబోయ్.. కూరగాయుల ధరలు మస్తు పిరం! ఇలా అయితే బతికేదెలా?



నిత్యావసర వస్తువులను కొనాలంటేనే సామాన్యుడు బెంబేలెత్తి పోతున్నాడు. బియ్యం, పప్పు ఉప్పులు.. వేటి ధరలు చూసినా అందనంత దూరంలో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో రోజురోజు కూ నింగినంటుతున్న నిత్యావసరాలు, కూరగాయల ధరలను చూసి సామాన్యులు హడలెత్తిపోతు న్నారు. వేలో ఉన్న ధరలతో పోలిస్తే ప్రస్తుతం అన్ని వస్తువుల ధరలు 30 నుంచి100 శాతం మేర పెరిగాయి. వరదలు, వర్షాల సాకుతో కూరగాయల వ్యా పారులు, సుంకాలు పెరిగాయంటూ నిత్యావసరాల వ్యాపారులు అడ్డగోలుగా ధరలు పెంచేశారు. రిటైల్ మార్కె ట్‌లో నాలుగు నెలల క్రితం కిలో రూ.28 ఉన్న టమోటాల ధర.. ప్రస్తు తం రూ.100కు చేరింది. విశాఖ పట్నం, విజయవాడ, కాకినాడ వంటి ప్రధాన నగరాల్లో రిటైల్ మార్కెట్‌లో రూ.100 నుంచి రూ.110 మధ్య పలుకుతోంది. గతేడాది ఇదే సీజన్‌లో మహారాష్ట్రలో కురిసిన వర్షాలతో టమోటా ధరలు ఒక్కసారిగా వంద దాటిపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అనంతపురం, గుంటూరు, విశాఖపట్నం, ఎన్టీఆర్ జిల్లాల్లోని ఎంపిక చేసిన కొన్ని రైతుబజార్లలో మాత్రమే సరఫరా చేస్తున్నారు. అది కూడా రూ.70కి పైగానే. ఇక కిలో రూ.25 ఉన్న ఉల్లి ప్రస్తుతం రూ.70 -80 వరకు విక్రయిస్తున్నారు. బంగాళదుంపలు మినహా మిగిలిన కూరగాయలన్నీ కిలో రూ.70 పైమాటగానే ఉన్నాయి. మూడు నెలల క్రితం రూ.10కు దొరికిన కొత్తిమీర కట్ట సైతం రూ.50-60 ఉంది. ఐదు కట్టలు రూ.20కు దొరికే ఆకుకూర ఏదైనాసరే కట్ట రూ.10కు తక్కువకు దొరకడంలేదు. మొత్తం మీద రూ.150-200 పెడితే బ్యాగ్ నిండే కూరగాయల కోసం ఇప్పుడు రూ.500-600 పెట్టాల్సి వస్తోంది. దీంతో కూరగాయలు కొందామంటే భయమేస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టమోటా రూ.100 దాటిపోయింది. రైతుబజార్లలో కూడా కిలో రూ.75కు తక్కువగా ఇవ్వడంలేదు. పైగా ఎక్కడా సరుకు ఉండడంలేదు. బహిరంగ మార్కెట్‌లో ఉల్లి నుంచి కొత్తిమీర వరకు అన్ని ధరలు చుక్కలనంటుతున్నాయి.కిలో రూ.20-30లకు వచ్చే బెండ, వంకాయలకు సైతం ప్రస్తుతం కిలో రూ.80కు పైగా పెట్టాల్సి వస్తోంది. కూరగాయ ఏదైనాసరే రూ.80కి తక్కువకు రావడం లేదు. బియ్యం, నూనె ధరలు అమాంతం పెరిగిపోయాయి. ధరల నియంత్రణను ప్రభుత్వం గాలికొదిలేసినట్లుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో కూరగాయలే కాదు.. నిత్యావసరాల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. గడిచిన నాలుగు నెలలుగా విపరీతంగా పెరిగాయి. ఆయిల్, పప్పుల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.

# రాజకీయ దురుద్దేశంతోనే కొండా సురేఖ కామెంట్స్ : నాగార్జున



టాలీవుడ్ నటి సమంతపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు సినీ, రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. కొండా సురేఖ కామెంట్స్‌పై క్రిమినల్ కేసుతోపాటు, పరువు నష్టం దావా విచారణలో భాగంగా నాంపల్లి కోర్టుకు నాగార్జున, అమల, నాగచైతన్యతోపాటు సుప్రి, వెంకటేశ్వర్లు హాజరయ్యారు.కోర్టు నాగార్జున స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్టు సమాచారం. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. మా కుటుంబానికి మంచి పేరు, ప్రతిష్టలున్నాయి. కొండా సురేఖ నా కుటుంబంపై అమర్యాదకరంగా.. నాగచైతన్య, సమంతపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. మా కుటుంబ పరువు, మర్యాదలకు భంగం వాటిల్లింది. మంత్రి చేసిన కామెంట్స్ అసత్య ఆరోపణలు. రాజకీయ దురుద్దేశంతోనే ఇలాంటి కామెంట్స్ చేశారు. ఈ వార్తలు అన్ని చానెళు ,, పేపర్లలో వచ్చాయి. కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టుకు నివేదించాడు.ఈ వ్యవహారంలో నాగార్జునతోపాటు మిగిలిన సాక్షుల స్టేట్‌మెంట్స్ కూడా రికార్డు చేసినట్టు తెలుస్తుండగా.. ఈ కేసుకు విచారణకు సంబంధించి పూర్తి వివరాలపై క్లారిటీ రావాల్సి ఉంది.

# షర్మిళ రివర్స్ బాణం



విజయవాడ, అక్టోబరు 8, (న్యూస్ పల్స్) : ఏపీ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా షర్మిళ స్పీడ్ పెంచారా.. ఒక వైపు కూటమికి, మరోవైపు వైసీపీకి తన కామెంట్స్ తో షాకిస్తూ.. రాజకీయంగా బలోపేతం కానున్నారా.. పక్కా వ్యూహంతో ఏపీలో కాంగ్రెస్ ను బలమైన పార్టీగా నిలపాలన్న తన లక్ష్యం వైపు షర్మిళ సాగుతున్నట్లు ఏపీ కాంగ్రెస్ ముఖచిత్రం కనిపిస్తోంది.మొన్నటి వరకు తన అన్న మాజీ సీఎం జగన్ లక్ష్యంగా.. విమర్శల వర్షం కురిపించిన షర్మిళ.. తన గురి కూటమి వైపుకు తిప్పినట్లు ఉందని తాజాగా ఆమె విమర్శలను గమనిస్తున్న రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సనాతన ధర్మ పరిరక్షణ కొరకు తాను ముందుంటానంటూ కామెంట్ చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి షర్మిళ ఘాటుగానే స్పందించారు.అధికారం లేని సమయంలో ఒక వేషబాష, అధికారం వచ్చాక మరో రకం వేషబాష కరెక్ట్ కాదంటూ షర్మిళ అన్నారు. అంతేకాకుండా ఒకే మతానికి మీరు మద్దతిస్తే.. మిగిలిన మతాలు ఏమి కావాలని ప్రశ్నలు సంధించారు. ఇప్పుడు మాత్రం ఏకంగా సీఎం చంద్రబాబుకు విశాఖ స్టీల్ ప్లాంట్ కు సంబంధించి షర్మిళ కౌంటర్ గట్టిగానే ఇచ్చారన్నది టాక్.ఆ లేఖను ఇప్పుడు షర్మిళ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేసి మరీ.. మీరు ఢిల్లీ వెళుతున్నారు.. కేంద్ర పెద్దలను విశాఖ ప్రైవేటీకరణ పై నిలదీయండి. లేకుంటే మద్దతు ఉపసంహరణ అంటూ డిమాండ్ పెట్టండి. ఆంధ్రుల హక్కు ముఖ్యమా? లేక బీజేపీతో పొత్తు ముఖ్యమా అంటూ ప్రశ్నించారు. అంతటితో ఆగక విశాఖ ఉక్కు ముఖ్యమా ? లేదా ఎన్డిఏ లో పదవులు ముఖ్యమా ? మాట మీద నిలబడే సిఎం అవుతారా ? లేక మోసగాడు గా ముద్ర వేసుకుంటారా ? తేల్చుకోండని ట్వీట్ చేశారు.కార్మికులకు విజయదశమి కానుకగా విశాఖ స్టీల్ ప్లాంట్ ను సెయిల్ లో విలీనం చేస్తున్నట్లు, 14 వేల మంది కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరిస్తున్నట్లు, భూములు కోల్పోయిన 8 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు, 23 వేల ఎకరాల్లో ఒక్క ఎకరా కూడా అమ్మేది లేనట్లు, అధికారిక ప్రకటన చేయించాలని, లేకుంటే ఎన్డిఏ కూటమి నుంచి వైదొలగాలని సీఎం చంద్రబాబుకుకాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.మరి షర్మిళ చేసిన ఈ ట్వీట్ కి టీడీపీ నుండి ఎటువంటి సమాధానం వస్తుందో కానీ.. ఇటీవల షర్మిళ తనదైన శైలిలో ఛాన్స్ దొరికినప్పుడల్లా కూటమి, వైసీపీ లక్ష్యంగా మాటల తూటాలు పేలుస్తున్నారు.

## పీక్స్ కు చేరిన ఫర్నిచర్ పంచాయితీ

**గుంటూరు, అక్టోబరు 8, (న్యూస్ పల్స్) ఏపీలో ఫర్నీచర్ పంచాయితీ పీక్స్ కి చేరింది. అసలేంటి.. కుర్చీలు, బల్లల పంచాయితీ? వైసీపీ వాదన ఏంటి? టీడీపీ అటాక్ లో లాజిక్ ఉందా?కూటమి సర్కార్ ఫర్నీచర్ పంచాయితీతో మాజీ సీఎం జగన్ ను కార్నర్ చేస్తోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావొస్తున్నా.. ఏపీలో అధికార, ప్రతిపక్షం మధ్య ఫర్నీచర్ ఫైట్ కొలిక్కి రావడం లేదు. ఫర్నీచర్ వ్యవహారమే టార్గెట్ గా టీడీపీ ట్వీట్లు చేయడం, దానికి వైసీపీ కౌంటర్ ఇవ్వడం కాక రేపుతోంది.మాజీ సీఎం జగన్ క్యాంప్ ఆఫీస్ లోని ఫర్నీచర్ అంశం రచ్చకు దారితీసింది. జగన్ క్యాంప్ ఆఫీసులోని ఫర్నీచర్ టార్గెట్ గా టీడీపీ చేసిన ట్వీట్లు కాక రేపుతున్నాయి. లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టినా జగన్ కి ప్రజల సొమ్ము మీద మోజు తీరలేదు అంటూ అటాక్ స్టార్ట్ చేసింది టీడీపీ. అధికారంలో ఉన్నప్పుడు తాడేపల్లి క్యాంప్ ఆఫీసును సెక్రటేరియట్ ఫర్నీచర్ తో నింపేశారని, పదవి పోయిన తర్వాత కూడా ఫర్నీచర్ ను ప్రభుత్వానికి తిరిగి ఇవ్వకుండా వాడుకుంటున్నారని విమర్శిస్తోంది.జగన్ ఇంటికి అల్యూమినియం విండోస్, డోర్లు, ఫ్యాన్లు, లైట్లు, కరెంట్ సామాన్లకు రూ.73 లక్షలు ఖర్చు చేశారని.. ఇంటి రెయిన్ ప్రూఫ్ పీవీసీ పగోడాస్, మొబైల్ టాయ్ లెట్స్ కి రూ.22.50 లక్షలు వాడారని అప్పటి జీవో కాపీలను బయటపెట్టింది టీడీపీ. ఇలా జగన్ ఇంటికి కోట్ల రూపాయల ప్రజాధనం వాడారని, ప్రభుత్వం మారిన తర్వాత తిరిగి ఇచ్చేయాలి కదా అని ప్రశ్నించింది టీడీపీ. అంతేకాదు త్వరలో అన్నీ బయటకు వస్తాయంటూ మరింత హీట్ పెంచింది టీడీపీ.**

## హనీమూన్ పిరియడ్ లోనే తొందరపాటా...

విజయవాడ, అక్టోబరు 8, ( వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి సార్వత్రిక ఎన్నికల యుద్ధంలో ఘోర పరాజయం తర్వాత మరో యుద్ధానికి సిద్ధం కావాలంటూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మళ్లీ శాసనసభ ఎన్నికలకు నాలుగున్నరేళ్ల సమయం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలకు సైతం దాదాపు మరో ఏడాది సమయం ఉంది. ప్రస్తుతం ఎన్నికల సమయం కాకపోయినా ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునివ్వడం వెనుక జగన్ వ్యూహం ఏంటనేది ఆసక్తి రేపుతోంది. లడ్డూ వివాదంతో విలవిల్లా డుతున్న ఆయన డైవర్షన్ పాలిటిక్స్ మొదలు పెట్టారా?యుద్ధానికి సిద్ధం అవ్వాలని వైసీపీ శ్రేణులకు జగన్ పిలుపునిచ్చారు. వైసీపీ అనుబంధ సంఘాల నాయకుల సమావేశంలో మాట్లాడిన మాజీ ముఖ్యమంత్రి కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తికాక ముందే యుద్ధం చేస్తానంటున్నారు. ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజల విశ్వాసం కూడా పోయిందని అంటున్నారు. నిజానికి ఏదైనా ఏర్పడిన తర్వాత ఆ ప్రభుత్వానికి కనీసం సంవత్సరం అయిన టైమ్ ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాతా ప్రభుత్వం ప్రజల సరిగ్గా పట్టించుకోకపోతే ప్రశ్నించాల్సిన బాధ్యత విపక్షంపై ఉంటుంది.అయితే వైసీపీ అధ్యక్షుడు ఆరు నెలలు కాకముందే యుద్ధం అంటుండటం వెనుక మతలబు ఏంటనే చర్చ సాగుతోంది.జగన్ విఫలమయ్యారనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు.. వారిని యాక్టివ్ చేసేందుకు జగన్ తన వంతు ప్రయత్నాలు ప్రారంభించారు. లడ్డూ వివాదంతో జగన్‌పై ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది. దీని నుంచి బయటకు వచ్చేందుకు, ప్రజల దృష్టిని మరల్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.మరోవైపు ఇంకో ఏడాదిలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి.

# మద్యం దుకాణాల కోసం లేని స్పందన

విజయవాడ, అక్టోబరు 8, ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వం కొత్త లిక్కర్ పాలసీ తీసుకు వచ్చింది. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు అంతా జే బ్రాండ్లను దింపి ప్రజల ఆరోగ్యాలను నాశనం చేశారని.. ప్రభుత్వం గుప్పిట్లోనే అన్ని పెట్టుకుని భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తూ వచ్చారు. దానికి తగ్గట్లుగానే టీడీపీ ప్రభుత్వం ఏర్పడితే మద్యం విధానాన్ని మార్చేస్తామని ప్రకటించారు. ఆ ప్రకారం కొత్త పాలసీని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు రెండేళ్ల పాటు కేటాయించేందుకు అప్లికేషన్లు ఆహ్వానించారు. అయితే ఈ దుకాణాల కోసం పెద్దగా డిమాండ్ ఉండటం లేదు. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేయాలంటే రెండు లక్షల రూపాయలు పెట్టి అప్లికేషన్ కొనాలి. అది నాన్ రిఫండబుల్ .అంటే లాటరీలో మద్యం దుకాణం వచ్చినా రాకపోయినా ఆ మొత్తం ప్రభుత్వానికే చెందుతుంది. తెలంగాణలో ఎన్నికలకు ముందు అక్కడి ప్రభుత్వం ఇలాగే దుకాణాల కోసం అప్లికేషన్లు ఆహ్వానిస్తే రెండు వేల కోట్లకుపైగా వచ్చాయి. ఏపీలోనూ అలాగే వస్తాయని అనుకున్నారు. కానీ చివరి తేదీ సమీపిస్తున్నా పెద్దగా స్పందన కనిపించడం లేదు. ఇప్పటి వరకూ అప్లికేషన్ల ఫీజుగా రెండు వందల కోట్ల వరకే వచ్చినట్లుగా తెలుస్తోంది. ఓ ఏరియాలో మద్యం దుకాణం కోసం మూడు అప్లికేషన్లు వస్తే మూడింటిలోనూ లాటరీ తీసి ఒకరికి ఇస్తారు. ఇక్కడే వ్యాపారులు అతి తెలివి చూపిస్తున్నారని.. అప్లికేషన్లు తమ ఏరియాలో ఎవరు కొనుగోలు చేస్తారో వారికి ముందుగానే ఆఫర్లు ఇస్తున్నారని చెబుతున్నారు. ఓ ముగ్గురు మాత్రం.. తమలో ఎవరికి వచ్చినా సరే ముగ్గురు పార్టనర్లుగా ఉండి మద్యం దుకాణం నడిపించుకోవచ్చన్న ఒప్పంతో రింగ్ అయి ఆ ముగ్గురే దరఖాస్తులు పెడుతున్నారు. ఇతరులు మాత్రం మధ్యలోనే వెనక్కి వెళ్లిపోతున్నారు. ఈ వ్యాపారుల్లో టీడీపీ నేతలు, వారి అనుచరులు ఎక్కువగా ఉన్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. మద్యం దుకాణం వస్తే.. భారీగా ఆదాయం వస్తుంది కాబట్టి.. చాలా కాలం తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ నేతలు వాటిని దక్కించుకునేందుకు అధికార దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. మద్యం దుకాణాలకు అప్లికేషన్లు తక్కువగా వస్తూండటంతో తెర వెనుక ఏం జిరగిందన్నదనిపై ప్రభుత్వ పెద్దలు ఆరా తీస్తున్నారు. అప్లికేషన్ పెట్టుకోవాలని అనుకంటున్న వారిని ఎవరైనా అడ్డుకున్నట్లుగా తేలితే కఠఇన చర్యలు తీసుకుంటామని సంకేతాలు పంపుతున్నారు. అలాగే ఎవరు రింగ్ కావొద్దని ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవొద్దని నేరుగానే చెబుతున్నారు. అయితే చాలా మంది ఎమ్మెల్యేలు ఈ దందాకు దూరంగా ఉన్నప్పటికీ.. కొంత మంది మాత్రం.. ఇదే అవకాశం అనుకని.. రింగ్ అయ్యేలా వ్యాపారుల్ని ?సిద్ధం చేస్తున్నరని చెబుతున్నారు. అప్లికేషన్ల గడువు ముగిసేలోగా ప్రభుత్వం అనుకున్న విధంగా స్పందన రాకపోతే గడువు పొడిగించే అవకాశం ఉంది.ప్రతి జిల్లాలో ఎమ్మెల్యేలు కలుగ చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో అయితే ఒడిస్సా సరిహద్దు నియోజకవర్గాల్లో షాపులకు ఎటువంటి దరఖాస్తులు వేయవద్దని ఓ కీలక నేత ఆదేశాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఒడిస్సా కు చెందిన ఓ ఎమ్మెల్యే తండ్రికి షాపులన్నీ వదిలేయాలని సదరు ప్రజాప్రతినిధి ఆదేశాలిస్తున్నట్లు సమాచారం. అదే జిల్లాల్లో రెండు నియోజకవర్గాల ముఖ్య ప్రజా ప్రతినిధులు ఇటీవల విశాఖలో మద్యం చేసుకోవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. పల్నాడు గుంటూరు, కృష్ణాజిల్లాలో అయితే ముఖ్య నేతలు రంగంలోకి దిగినట్లు ప్రచారం జరుగుతోంది.

# ట్రెండింగ్ లో మాధురి వంటలు

శ్రీకాకుళం, అక్టోబరు 8, (న్యూస్ పల్స్) ఆమె వయసు 33.. ఆయన వయసు ఫిఫ్టీ ప్లస్.. అయినా ప్రేమకు వయసేంటని ఇద్దరు నిరూపించారు. కుటుంబ వ్యవహారం రోడ్డున పడినా సరే.. తమ ప్రేమకు లేరు ఎవ్వరు అడ్డు అన్నట్టు వ్యవహారం సాగుతోంది. ఇంతకీ ఎవరి గురించి ఇదంతా అనుకుంటున్నారా.. వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను ప్రేయసి దివ్వెల మాధురి ప్రేమ వ్యవహారం గురించే.వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మొదటి భార్య వాణిని కాదని మరో మహిళ దివ్వెల మాధురితో సహజీవనం చేస్తున్న సంగతి తెలిసిందే.. ఈ వ్యవహారం ఇప్పు గత కొద్దిరోజులుగా ఏపీ పాలిటిక్స్ హాట్ టాపిక్‌గా మారింది. మొన్నటి కుటుంబ వ్యవహారం రోడ్డున పడింది. అయినా కూడా మాధురి ఎక్కడ తగ్గడం లేదు. ఇనాళ్లు ప్రైవేటుగా నడిపించిన వ్యవహారం ఇప్పుడు పబ్లిక్ లోకి తీసుకొస్తోంది మాధురి. దువ్వాడ శ్రీనుతో ప్రేమ వ్యవహారాన్ని బహిరంగానే ప్రస్తావిస్తోంది.తాజాగా తన సొంత యూట్యూబ్ చానల్‌లో దువ్వాడ శ్రీను కోసం ఇష్టమైన పప్పుచారు అని ఓ వీడియోను రిలీజ్ చేసింది. సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతోంది ఈ వీడియో. మొన్నటి కుటుంబ వ్యవహారం రోడ్డున పడింది. అయినా కూడా మాధురి ఎక్కడ తగ్గడం లేదు. ఇన్నాళ్లు ప్రైవేటుగా నడిపించిన వ్యవహారం ఇప్పుడు పబ్లిక్ లోకి తీసుకొస్తోంది మాధురి. దువ్వాడ శ్రీనుతో ప్రేమ వ్యవహారాన్ని బహిరంగానే ప్రస్తావి స్తోంది. తాజాగా తన సొంత యూట్యూబ్ చానల్ లో దువ్వాడ శ్రీను కోసం ఇష్టమైన పప్పుచారు అని ఓ వీడియోను రిలీజ్ చేసింది. సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతోంది ఈ వీడియో.ఇటీవల ఆమె సోషల్ మీడియాలో దువ్వాడ శ్రీనివాస్ ను ఉద్దేశిస్తూ పోస్టులు పెడుతున్నారు. ఆ మొన్న. ఇష్టంగా అనుకున్నాను. కానీ, వ్యసనంగా మారిపోయావు.. అంటూ రీల్ పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఆమె పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దువ్వాడ శ్రీనివాస్ ను ఉద్దేశించే ఆమె ఇలాంటి పోస్టులు చేశారన్న చర్చ జరుగుతుంది. మొత్తానికి సోషల్ మీడియాలో దివ్వెల మాధురి పెట్టిన పోస్టులు హీటెక్కిస్తున్నాయి.తిరుమలలో దువ్వాడ, మాధురితెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ దువ్వాడ కుటుంబ వివాదం ఒక రేంజ్ లో రచ్చ చేసింది. ఒక సీరియల్ ఎపిసోడ్ లా మారింది. తెలుగు మీడియాకు అదే ప్రధాన వనరుగా మారిపోయింది. విజయవాడ వరదలు సంభవించిన వరకు అదే ప్రధాన వార్తగా నిలిచింది. తన భర్త వేరే మహిళతో సన్నిహితంగా ఉంటున్నారని ఆరోపిస్తూ దువ్వాడ శ్రీనివాస్ భార్య వాణి తన ఇద్దరు పిల్లలతో కలిసి.. దువ్వాడ నూతన గృహంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు.అక్కడ నుంచి రచ్చ ప్రారంభమైంది. మధ్యలో దువ్వాడ శ్రీనివాస్ సన్నిహితురాలు మాధురి ఎంట్రీ ఇచ్చారు. దువ్వాడతో తనకు ఉన్న సంబంధాలపై రకరకాలుగా మాట్లాడారు. ఎన్నికల ముందు నుంచి దువ్వాడతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. తొలుత దువ్వాడ వాణి వైఖరితోతాను ఇబ్బంది పడ్డానని.. నడి వీధిలోకి వచ్చానని చెప్పుకొచ్చారు మాధురి.తరువాత దువ్వాడ శ్రీనివాస్ కు అప్పు ఇచ్చానని.. అప్పులో భాగంగా ఆ ఇంటిని స్వాధీనం చేసుకుంటున్నానని చెప్పుకొచ్చారు. దీంతో వివాదం మరింత పెరిగింది. చివరకు దువ్వాడ శ్రీనివాస్ ఆ రెండు కోట్ల అప్పుకు బదులు ఇంటిని మాధురి పేరుతో రాశారు. దీంతో వివాదానికి ఫుల్ స్టాప్ పడింది. అదే ఇంట్లో ప్రస్తుతం దువ్వాడ శ్రీనివాస్ తో పాటు మాధురి ఉంటున్నారు. ఇద్దరూ సహజీవనం చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. సరిగ్గా ఇదే సమయంలో దువ్వాడ శ్రీనివాస్, మాధురీలు తిరుమలలో ప్రత్యక్షం కావడం విశేషం.ప్రస్తుతం తిరుమలలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి.లక్షలాదిమంది భక్తులు తరలివస్తున్నారు.సరిగ్గా ఇటువంటి క్రమంలోనే దువ్వాడ శ్రీనివాస్,మాధురి తిరుమలలో కనిపించారు.అటు మీడియా సైతం వారికి ఎనలేని ప్రాధాన్యం ఇచ్చింది.దువ్వాడ శ్రీనివాస్ వెంట అనుచరులు,కొంతమంది వైసీపీ నేతలు సైతం ఉన్నారు.అయితే దాదాపు భార్య మాదిరిగానే ఆమె తిరుమలలో శ్రీనివాస్ వెంట ఉండడం కనిపించింది.ఇటీవలే దువ్వాడ శ్రీనివాస్ హీరోగా వాలంటీర్ అనే సినిమాను రూపొందించారు మాధురి.దానిని యూట్యూబ్ ఛానల్ ద్వారా విడుదల చేశారు. మధ్యలో స్కూటీపై ఆ జంట కనువిందు చేస్తూరూపొందించిన రీల్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ప్రస్తుతంవారిద్దరూ కొత్త ఇంట్లో ఏకాంతంగా గడుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.దానిని నిజం చేసేలాఆ ఇద్దరు సన్నిహితులు రీల్స్ చేస్తూ కనిపించడం విశేషం. ఇప్పుడు ఏకంగా తిరుమల శ్రీవారి సన్నిధిలో సైతం ప్రత్యేక పూజలు జరపడం ప్రాధాన్యత సంతరించుకుంది. దువ్వాడ వాణి విడాకులు ఇస్తే తాము పెళ్లి చేసుకుంటామని ఇది వరకే మాధురి ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే వీరి బంధం పై రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు కసరత్తు షురూ

ఏలూరు, అక్టోబరు 8, (న్యూస్ పల్స్) ఏపీలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల కమిషన్ సన్నాహాలు ప్రారంభించింది. దీంతో ప్రధాన పార్టీలు పోటీకి సిద్ధవవుతున్నాయి. ముఖ్యంగా వైసీపీ సత్తా చాటాలని భావిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో దారుణ పరాజయం మూటగట్టుకుంది ఆ పార్టీ. అందుకే పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో గెలిచి గట్టి సవాల్ ఇవ్వాలని చూస్తోంది. జగన్ సైతం ఇప్పటికే వైసీపీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. మరోవైపు కూటమిలోని ప్రధాన పార్టీగా ఉన్న టిడిపి సైతం అభ్యర్థులను దాదాపు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. దీంతో మరో సమరానికి తెరలేచింది. అయితే కూటమిలోని ప్రధాన పార్టీగా ఉన్న టిడిపి గెలవాలంటే.. జనసేన మద్దతు కీలకం. అయితే ఈ రెండు పట్టభద్రుల స్థానాల్లో పోటీ చేస్తున్న టిడిపి అభ్యర్థులు.. జనసేన ఎమ్మెల్యేలకు మరో అధికార కేంద్రంగా మారే అవకాశం ఉంది. అందుకే వారు సహకరిస్తారా? లేదా? అన్న చర్చ నడుస్తోంది. జనసేన ఎమ్మెల్యేలు సహకరిస్తే గాని టిడిపి అభ్యర్థులు గెలిచే ఛాన్స్ లేదు. కూటమిలోని ఈ పరిస్థితిని గమనించిన వైసీపీ గెలుపు కోసం వ్యూహం పన్నుతోంది. దీంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రసవత్తరంగా మారుతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలకు సంబంధించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది. చైతన్యవంతమైన జిల్లాలుగా గుర్తింపు పొందిన ఈ రెండు జిల్లా ల్లో పట్టబద్రులు ఎటువైపు మొగ్గుచూపుతారు అన్న ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఇక్కడ టిడిపి అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజా బరిలో దిగే ఛాన్స్ కనిపిస్తోంది. రాజా సుదీర్ఘ కాలం తెనాలి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. మంత్రిగా కూడా పని చేశారు. ఈ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు.

# టార్గెట్ పెద్దిరెడ్డి...

తిరుపతి, అక్టోబరు 8, (న్యూస్ పల్స్) వైసీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డిని తొక్కేయాలని చంద్రబాబు భావిస్తున్నారా?పొలిటికల్ గా దెబ్బ తీయాలని గట్టి ఆలోచన చేస్తున్నారా? ఎట్టి పరిస్థితుల్లో పుంగనూరులో ఆ కుటుంబం గెలవకూడదని నిర్ణయానికి వచ్చారా?అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది.మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ద్వారా పెద్దిరెడ్డి కి చెప్పాలని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. ఆదివారం హైదరాబాదులో చంద్రబాబుతో కిరణ్ కుమార్ రెడ్డి గంట పాటు సమావేశమయ్యారు.చాలా లోతుగా చర్చించినట్లు తెలుస్తోంది. పెద్దిరెడ్డి హవా గత ఐదేళ్లుగా నడిచింది.పెద్దిరెడ్డి తీరుతో ఇటు చంద్రబాబు,అటు కిరణ్ కుమార్ రెడ్డి కూడా అసౌకర్యానికి గురయ్యారు.చాలా రకాల ఇబ్బందులు పడ్డారు. ఆ ఇద్దరు నేతల రాజకీయ ఉనికిని ప్రశ్నార్థకం చేయడానికి పెద్దిరెడ్డి ప్రయత్నించారు.అందుకే ఇప్పుడు ఆ ఇద్దరు నేతలు వ్యూహాత్మకంగా చేతులు కలిపినట్లు తెలుస్తోంది. ఇప్పటికే టిడిపి ఎమ్మెల్యేగా కిరణ్ సోదరుడు ఉన్నారు.ప్రస్తుతం బిజెపిలో కొనసాగుతున్నారు కిరణ్ కుమార్ రెడ్డి. మొన్నటి ఎన్నికల్లో రాజంపేట పార్లమెంట్ స్థానం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేశారు. పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి గట్టి పోటీ ఇచ్చారు.ఓటమి అంచుకు తీసుకువచ్చారు.అటు పుంగనూరులో సైతం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వల్ప ఓట్లతో గట్టెక్కగలిగారు.అయితే వచ్చే ఎన్నికల నాటికి పెద్దిరెడ్డి పేరు వినిపించకుండా చేయాలని చంద్రబాబు కృత నిశ్చయంతో ఉన్నారు. అందుకే కిరణ్ కుమార్ రెడ్డితో సుదీర్ఘ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. తాజాగా కిరణ్ చర్యలు చూస్తుంటే టిడిపి వైపు చూస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన తర్వాత ఆ పార్టీ కార్యకర్తల్లో అంతగా పాల్గొనడం లేదు కిరణ్.అదే సమయంలో టిడిపి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.చంద్రబాబు పాలనపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన టిడిపికి చేరువ అవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈ తరుణంలోనే ఆయన చంద్రబాబుతో భేటీ కావడం ఈ అనుమానాలకు బలం పెంచుతోంది. బిజెపి రాష్ట్ర పగ్గాలు కిరణ్ కు అప్పగిస్తారని ప్రచారం సాగింది. తెలంగాణతో పాటు ఏపీ అధ్యక్ష పదవులను ప్రకటిస్తారని.. ఈ మేరకు కిరణ్ పేరు ఖరారు చేసినట్లు తెగ ప్రచారం నడిచింది.అయితే ఇప్పుడు బిజెపి నుంచి టిడిపిలో చేరితే.. తరచూ పార్టీలు మారుతారన్న అపవాదు ఆయనపై ఏర్పడే అవకాశం ఉంది. ఇప్పటికే సోదరుడుటిడిపి ఎమ్మెల్యేగా ఉన్నారు.చిత్తూరు జిల్లాలో చంద్రబాబు ఆయనకు ఎనలేని ప్రాధాన్యమిస్తున్నారు. అయితే ఇప్పుడు కిరణ్ చంద్రబాబుని ఎందుకు కలిశారా? అన్నది ప్రశ్న. ప్రతిష్టాత్మకమైన టిటిడి చైర్మన్ పదవి కోసమని కూడా ప్రచారం సాగుతోంది. మరోవైపు రాజ్యసభ పదవి అడిగినట్లు కూడా టాక్ నడుస్తోంది. ఎందుకంటే ఏపీ నుంచి రాజ్యసభకు ఎన్నికవ్వాలంటే చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సిందే. అందుకే చంద్రబాబును కలిసి తన రాజకీయ భవిష్యత్తు గురించి చర్చించారని తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# పార్టీకి దూరంగా పత్తిపాటి

గుంటూరు, అక్టోబరు 8, (న్యూస్ పల్స్) ఏపీలో కొంతమంది టీడీపీ ఎమ్మెల్యేల వ్యవహార శైలి హై కమాండ్ కు తలనొప్పిగా మారుతోంది. కూటమి అధికారంలోకి వచ్చినప్పుడే చంద్రబాబు స్పష్టంగా చెప్పారు. ప్రజలు ఎంతో నమ్మకంతో అధికారాన్ని అప్పగించారని.. వైసిపి ప్రజాప్రతినిధుల చర్యలకు విసిగి వేశారి మిమ్మల్ని గెలిపించారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ప్రజాక్షేత్రంలో ఉన్నప్పుడు చాలా రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అయితే ఇలా కొద్దిరోజులకే ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఒక్కొక్కరు వివాదాల్లో చిక్కుకుంటున్నారు. ఒక ఎమ్మెల్యే లైంగిక వేధింపుల ఆరోపణలకు గురయ్యారు. దీంతో పార్టీ ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. మరొకరు వివాదాస్పద ప్రవర్తనతో పార్టీ క్రమశిక్షణ సంఘం ఎదుట హాజరయ్యారు. తన పనితీరును మార్చుకుంటానని చెప్పుకొచ్చారు. అయితే పార్టీలో సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్న ప్రతిపాటి పుల్లారావు ఇప్పుడు పార్టీలో యాక్టివ్ గా లేకపోవడం కొత్త చర్చకు దారితీస్తోంది. గత నెలలో ఆయన భార్య వెంకాయమ్మ జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. వివాదాస్పదంగా మారాయి. ఏకంగా పోలీస్ సిబ్బంది జన్మదిన కేకు కట్ చేయడంలో పాల్గొన్నారు. దీంతో ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. స్వయంగా చంద్రబాబు ఎదుట హాజరైన ప్రత్తిపాటి పుల్లారావు వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అది యాదృచ్ఛికంగా జరిగిన ఘటనగా చెప్పుకొచ్చారు. మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటానని చెప్పుకొచ్చారు. దీంతో వివాదం సద్దుమణిగింది. కానీ అటు తరువాత పార్టీ కార్యక్రమాల్లో ప్రతి పార్టీ పుల్లారావు యాక్టివ్ తగ్గించారు. దీంతో రకరకాల చర్చ ప్రారంభం అయ్యింది. ఆయన అలకబూనారా? అసంతృప్తికి గురయ్యారా? అన్నది తెలియాల్సి ఉంది.ప్రత్తిపాటి పుల్లారావు పార్టీలో సీనియర్. 2014 ఎన్నికల్లో చిలకలూరిపేట నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు.దీంతో చంద్రబాబు క్యాబినెట్లో పుల్లారావు కు చోటు దక్కింది. ఆ ఐదేళ్లపాటు పార్టీతో పాటు ప్రభుత్వంలో క్రియాశీలకంగా వ్యవహరించారు ఆయన. కానీ 2019 ఎన్నికల్లో అదే చిలకలూరిపేట నుంచి పోటీ చేసి.. విడదల రజిని చేతిలో ఓడిపోయారు. ఓడిపోయిన తర్వాత నియోజకవర్గంలో పార్టీని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఇటువంటి సమయంలో చంద్రబాబు పిలిచి బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల్లో టికెట్ కూడా ఇచ్చారు. గెలిచిన పుల్లారావు మంత్రి పదవి ఆశించారు. కానీ దక్కలేదు.పుల్లారావు భార్య వెంకాయమ్మ రాజకీయాల్లో చాలా యాక్టివ్ గా ఉంటారు. తనకు మంత్రి పదవి దక్కకపోవడంతో భార్యకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని ఆయన కోరుతూ వచ్చారు. రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవి ఇవ్వాలని కోరారు. అందుకు దరఖాస్తు చేసుకున్నారు కూడా. అయితే మూడు పార్టీల కూటమి నేతలకు సర్దుబాటు చేయాల్సి రావడంతో.. చంద్రబాబు వెంకాయమ్మ పేరును పరిగణలోకి తీసుకోలేదు. ఆమెకు ఎటువంటి నామినేటెడ్ పదవి దక్కలేదు. ఆయనలో అసంతృప్తికి అదొక కారణమని తెలుస్తోంది.ఇంకోవైపు వైసీపీ హయాంలో పుల్లారావు కుమారుడు పై జిఎస్టి కేసు నమోదయింది. కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కుమారుడిపై జిఎస్టి కేసు రద్దు అవుతుందని పుల్లారావు భావించారు. ఈ విషయంలో చంద్రబాబు సాయాన్ని కూడా అడిగారు. అయితే జిఎస్టి అనేది కేంద్ర పరిధి కావడంతో కొన్ని రకాల ఇబ్బందులు ఉన్నాయి. అందుకే కేసు రద్దు విషయంలో జాప్యం జరుగుతోంది. తనకు మంత్రి పదవి దక్కకపోవడం, భార్యకు నామినేటెడ్ పదవి ఇవ్వకపోవడం, కుమారుడిపై కేసులు రద్దు కాకపోవడంతో పుల్లారావు మనస్థాపానికి గురైనట్లు తెలుస్తోంది.

## అర్ధనారీశ్వర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన జమ్ములమ్మ దేవి..



విభారె న్యూస్ అక్టోబర్ 08 ఎమ్మిగనూరు..స్థానిక సోగనూరు రోడ్డు లో వెలసిన శ్రీ జమ్ములమ్మ దేవి ఆలయం లో దసరా నవరాత్రులలో భాగంగా 5వ రోజైన ఆశ్వయుజ శుద్ధ పంచమి సోమవారం రోజు కైలాసగిరి అర్ధనారీశ్వర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇదివరలో నూతనంగా నిర్మించిన దేవాలయం అయినప్పటికీ భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. జమ్ములమ్మ దేవాలయం చాలా ప్రసిద్ధిగాంచినది. భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులైనారు. జమ్ములమ్మ దేవికి ప్రతిరోజు ప్రాతఃకాలంలోనే అభిషేకాలు,అర్చన అమ్మవారి అలంకరణ, విశేష పూజలు పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులకు దర్శనానంతరం ప్రసాద వితరణ దేవాలయం వారిచే గావించారు. పూజా కార్యక్రమాలన్నీయూ ఆలయ ధర్మకర్త తట్టి బుడ్డప్ప దంపతులచే నిర్వహిస్తున్నారు.

## నూతన ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే బీవీ...



విభారె న్యూస్ అక్టోబర్ 08 ఎమ్మిగనూరు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారంగా కూటమి ప్రభుత్వం త్వరలోనే ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి తెలిపారు.ఎమ్మిగనూరు ఆర్టీసీ నూతనంగా నాలుగు బస్సులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ మేరకు బస్సును ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి నడిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఒక బస్సు గానీ,ట్రైన్ గాని తెచ్చిన దాఖలాలు లేవన్నారు. ఎమ్మిగనూరు ఆర్టీసీ బస్టాండ్ ను నా తండ్రి మాజీ మంత్రి బీవీ. మోహన్ రెడ్డి ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మంగళవారంను పురస్కరించుకుని జమ్ములమ్మకు అమ్మవారి అలంకరణ..

విభారె న్యూస్ అక్టోబర్ 08ఎమ్మిగనూరు..స్థానిక సోగనూరు రోడ్డులో వెలసిన శ్రీ శ్రీ శ్రీ జమ్ములమ్మ దేవి ఆలయంలో ఆశ్వయుజ మాసం బహుళ పంచమి మంగళవారంను పురస్కరించుకొని జమ్మలమ్మ దేవి విగ్రహానికి అమ్మవారి అలంకరణను గావించారు. మంగళవారం సందర్భంగా భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు అయ్యారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు.




# నూతన బస్సులను ప్రారంభించిన మంత్రివర్యులు టి.జి. భరత్..

### - మంత్రివర్యులను సన్మానించిన ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు..



విభారె న్యూస్ అక్టోబర్ 08 ఎమ్మిగనూరు..ప్రయాణీకుల సౌకర్యార్థం, మంగళవారం మధ్యాహ్నం 08.10.2024 న మధ్యాహ్నం 03.00 గంటలకు కర్నూలు-1 డిపో గ్యారేజీలో 2 క్రొత్త సూపర్ లగ్జరీ బస్సులను, 1 క్రొత్త అల్ట్రా డీలక్స్ బస్సులను కర్నూలు శాసన సభ్యులు, మంత్రి టి.జి. భరత్ ప్రారంభించారు.ఒక సూపర్ లగ్జరీ బస్సు కర్నూలు-బెంగళూరు రూటులో,మరో సూపర్ లగ్జరీ బస్సు, అల్ట్రా డీలక్స్ బస్సులను కర్నూలు-తిరుపతి రూట్ల నందు త్రిప్పడం జరుగును. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు, కర్నూలు-1 మేనేజరు శ్రీమతి సుధారాణి,కర్నూలు-2 డిపో మేనేజరు సర్దార్ హుస్సేన్,కర్నూలు-1, కర్నూలు-2 డిపోల అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్వైజర్లు,సిబ్బంది పాల్గొంటారు

## అయ్యలూరులో దుర్గా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట :పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి రెడ్డి



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 08-నంద్యాల మండలం అయ్యలూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఆలయంలో శ్రీ దుర్గా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే శిల్పారవి రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేకంగా దసరా శరన్నవరాత్రి వేడుకల పర్వదినాలలో శ్రీ దుర్గా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి హాజరు కావడం ఏంతో భాగ్యంగా భావిస్తున్నామన్నారు. బ్రహ్మాండమైన వెండి తొడుగును అమ్మవారి విగ్రహానికి ఏర్పాటుచేసిన ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలకు ఆ అమ్మవారి కృపాకటాక్షములు ఎల్లవేళలా ఉండాలని కోరారు. అమ్మవారి చల్లని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు బసవేశ్వర్ రెడ్డి,రవికుమార్ రెడ్డి, రషీద్ ఎంపిటిసి, షఫీ ,అనిల్ రెడ్డి, ప్రసాదు ,కటారి బాలుడు,పరమేశ్వర రెడ్డి, ఐలూరు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు...


## ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన

### ---సతీష్ రెడ్డి వైసీపీ స్టేట్ జనరల్ సెక్రటరీ



--- విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 08-సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని వైసీపీ పార్టీ స్టేట్ జనరల్ సెక్రటరీ సతీష్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వైసీపీ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్సీపీ నియోజకవర్గ ఇన్చార్జి ల ముఖ్య నాయకుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. నంద్యాల జిల్లా వైసీపీ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం లో స్టేట్ జనరల్ సెక్రటరీ సతీష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తిరుపతి లడ్డూ గురించి వైసీపీ పార్టీ పై బురద చల్లడం మంచి పద్దతి కాదన్నారు. జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం ప్రజలకు అండగా నిలవాలి పార్టీని నమ్ముకొని ఉన్నవారికి ప్రాధాన్యతనివ్వాలి అన్నారు.అలాగే పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆళ్లగడ్డ మరియు గడివేముల మండలాల ఎస్ఐలు టిడిపి కార్యకర్తల కంటే ఎక్కువగా రెచ్చిపోతున్నారన్నారు. సీన్ రివర్స్ అయితే ఇబ్బంది పడతారని హెచ్చరించారు. పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు ఇస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ,గంగుల ప్రభాకర్ రెడ్డి , నంద్యాల మాజి ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డి , నియోజకవర్గ ఇంచార్జిలు గంగుల బ్రిజేంద్ర రెడ్డి , కాటసాని రామిరెడ్డి,శిల్ప రవిరెడ్డి , ఎమ్మెల్సీ ఇషాక్ బాషా ,భూమా కిషోర్ రెడ్డి ,జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్ర బోతుల పాపి రెడ్డి , ధార సుధీర్ , పాణ్యం మాజి జట్ పీ టీసీ సూర్య నారాయణ రెడ్డి పాల్గొన్నారు..

## కాళికాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన వాసవి మాత...



విభారె న్యూస్ అక్టోబర్ 08 ఎమ్మిగనూరు..స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం లో దేవి శరన్నవరాత్రి ఉత్సవములు లో భాగంగా ఆరవరోజైన మంగళవారం వాసవి మాత కాళికాదేవి అలంకరణ లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక గర్భగుడిలో ఉన్న వాసవి మాత విగ్రహమునకు ఆలయ ప్రధాన అర్చకులు రాతన గురు ప్రసాద్ వారిచే కాళికాదేవి అలంకరణ గావించడం జరిగినది.ఉత్సవ విగ్రహమునకు మెట్టే పరమేష్ వారి బృందం చే కాళికా దేవి అలంకరణ గావించడం జరిగినది. భక్తుల విరివిగా పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

## శ్రీ మహాలక్ష్మి అలంకరణలో అమ్మ వారు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 08-నంద్యాల తెలుగు పేటలో వెలసిన శ్రీ ఘణ మద్దులేటి లక్ష్మీ నృసింహాస్వామి దేవస్థానంయ౦ందుదసరా శరన్నవరా త్రుల పూజా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం 6వ రోజు శుద్ధ పంచమి ఆలయం లో అమ్మ వారు “శ్రీ మహా లక్ష్మిదేవిఅమ్మ”వారి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు . దేవి నవరాత్రుల పూజా దాతల స్వామి, అమ్మ వారి అభిషేకం మరియు అష్టోత్తర పూజా కార్యక్రమం లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## అన్న క్యాంటీన్లు ప్రారంభం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 08-: నంద్యాల పట్టణంలో 14 వ తేదీ సోమవారం సాయంత్రం అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న క్యాంటీన్ మరియు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న క్యాంటీన్ ను రెండింటిని రాష్ట్ర మంత్రి వర్యులు ఎన్ ఎమ్ డి ఫరూక్. బీసీ జనార్ధన్ రెడ్డి. ఎంపీ శబరి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. ప్రోటోకాల్ ప్రకారం ముందుగానే ప్రజాప్రతినిధు లకు సమాచారం అందిస్తామని కమిషనర్ అన్నారు.


## ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన సుంకులమ్మ..



విభారె న్యూస్ అక్టోబర్ 08 ఎమ్మిగనూరు. దేవి శరన్నవరా త్రుల్లో భాగంగా ఆరవ రోజు అయిన మంగళవారం రోజు సుంకులమ్మ దేవాలయంలో ధనలక్ష్మి అలంకరణలో సుంకులమ్మ భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయాన్నే అమ్మవారికి పూజారి నాగరాజు కుటుంబ సభ్యులచే పంచామృతాభిషేకం, అర్చన, ఆకు పూజ వివిధ పూజలు నిర్వహించారు. అనంతరం సుంకులమ్మకు ధనలక్ష్మి అలంకరణను గావించారు. అమ్మవారికి పూలు పండ్లు నైవేద్యం ఒడిబియ్యం సమర్పించి మహా మంగళహారతి నిర్వహించారు. పూజ అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. ధనలక్ష్మి అలంకారమును నిర్వహించినవారు కార్తీక, ఉష, సుగుణ..

## మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీ గాయత్రి మాత..

విభారె న్యూస్ అక్టోబర్ 08 ఎమ్మిగనూరు. స్థానిక గీతానగర్లో వెలసిన శ్రీ గాయత్రి దేవాలయంలో శ్రీ గాయత్రి శరన్నవరాత్రులను పురస్కరించుకొని ఆర వరోజైన మంగళవారం రోజు మహాలక్ష్మి అలంకరణను గాయత్రీ దేవికి అలంకరించారు. భక్తులకు మహాలక్ష్మి అలంకరణలో గాయత్రి మాత దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు బలకుంది నరహరి శాస్త్రి చే పూజా కార్యక్రమాలన్నీయూ నిర్వహించారు. పూజ అనంతరం నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజు హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహింతురు. పూజ అనంతరం అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు విరివిగా పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అర్చకులు బలకుంది నరహరి శాస్త్రిచే ప్రసాద వితరణ గావించారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190